పంట నష్టానికి ఏడాది.. పరిహారమేది?

- మార్కాపురం సబ్ డివిజన్‌లో 3 మండలాల రైతుల ఎదురుచూపులు
- 5.26 కోట్ల రూపాయల పరిహారం విడుదలలో ప్రభుత్వం మీనమేషాలు
- అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదిగా అందని సాయం
- పెట్టుబడి కోసం తిప్పలు పడుతున్న అన్నదాతలు


ఎండిపోయిన పత్తి చేను

తర్లుపాడు: శ్రమనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులను ప్రకృతి కకావికలం చేస్తే దన్నుగా నిలిచి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తూ కొర్రీలు పెడుతోంది. అకాల వర్షాలు, ఈదురు గాలుల ప్రభావంతో చేతికొచ్చిన పంట కోల్పోయి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఏడాదిగా నిరాశ నిస్పృహలు తప్పడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోయిన రైతులకు ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో పరిహారం అందించి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం రైతులకు పరిహారం దక్కడం లేదు. గతేడాది ఖరీఫ్ సీజన్, ఈ ఏడాది రబీ సీజన్‌లో పంట నష్టం సంభవించినా నేటికీ రైతులకు పరిహారం అందలేదు.

మార్కాపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ప్రభుత్వం పరిహారం అందించకుండా మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇక రబీ సీజన్ ప్రారంభమైన తర్వాత డిసెంబర్‌లో మాత్రమే వర్షం కురిసింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సరైన వర్షం లేకపోవడంతో రబీ సీజన్లో సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కరువు మండలాలను ప్రకటించింది. అందులో మార్కాపురం, తర్లుపాడు మండలాలు కూడా ఉన్నాయి. కరువు మండలాల ప్రకటన వచ్చి నెలరోజులు దాటినా సాయం మాత్రం దక్కలేదు. దీంతో రైతులు రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

గత ఏడాది ఖరీఫ్ నష్టం మండలాల వారీగా ఇలా..

మండలం	నష్టపోయిన రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	అందాల్సిన పరిహారం(రూ.లో)
మార్కాపురం	2,709	2293.12	3,89,02,035
పెద్దారవీడు	1,363	755.06	1,28,87,071
తర్లుపాడు	72	50.64	8,61,033

ఇలా మొత్తం మీద సుమారు 5.26 కోట్ల రూపాయల పరిహారం రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అందాల్సి ఉంది. దీంతో పాటు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు కూడా ఎండిపోయాయి. ప్రభుత్వం ఇంత వరకు నష్టాన్ని అంచనా వేయించకపోగా, పరిహారం ఇవ్వడంలోనూ జాప్యం చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

పరిహారం అందలేదు



గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల వల్ల, ఈ ఏడాది రబీ సీజన్‌లో వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతిని చాలా నష్టపోయాం. ఈ రెండు సీజన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం మాకు అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారో తెలియడం లేదు. ప్రభుత్వం ఉదారంగా స్పందించి రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నాం.
– జనార్దన్‌రెడ్డి, రైతు, తాడివారిపల్లి

పరిహారమిస్తే ఉపశమనం



గత ఖరీఫ్‌లో భారీ వర్షాలు, రబీలో వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అరకొరగా పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. దీని వల్ల రైతులు నష్టాలపాలయ్యారు. ప్రభుత్వం సాయమందిస్తే కొంతలో కొంత ఉపశమనంగా ఉంటుంది.
– మందా వెంకటేశ్వరరెడ్డి, రైతు, మేకలవారిపల్లి

అంచనాలు ప్రభుత్వానికి పంపాం

ఖరీఫ్‌లో అధిక వర్షాల వలన పత్తి, రబీలో వర్షాభావం వల్ల కంది, మినుము, బొబ్బర్లు తదితర పంటలు ఎండిపోయాయి. నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు రాగానే రైతులకు అందిస్తాం.
– వెంకటేశ్వర్లు, ఏఓ, తర్లుపాడు

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

కంభం: బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. గురువారం కంభం సచివాలయాన్ని, బస్టాండ్ సమీపంలో 6వ నంబరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కంభం పంచాయతీ కార్యాలయంలో జనన ధ్రువీకరణ పత్రాల రిజిస్టర్లను పరిశీలించారు. జీఓఎంఎస్ నం.31, 39ను అనుసరించి బాల్య వివాహాలకు సంబంధించిన రికార్డులు, జీఓఎంస్ నం.1ను అనుసరించి బాలల పరిరక్షణకు సంబంధించిన కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రతి సచివాలయంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు ప్రదర్శించాలని సూచించారు. గ్రామ కమిటీల వివరాలు, కిశోర వికాసానికి సంబంధించిన కౌమార బాలికల గ్రూపుల వివరాలు పరిశీలించారు. సచివాలయాల్లో సమావేశాలు సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆమెను కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, కార్మిక శాఖ సహాయశాఖాధికారి బాలకాశి, డీసీటీఓ దినేష్, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సీడీపీఓ నీలోఫర్, కార్యదర్శి మోహన్ రెడ్డి, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


బేస్తవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

అంగన్‌వాడీ సెంటర్లను పకడ్బందీగా నిర్వహించాలి

గిద్దలూరు రూరల్: అంగన్‌వాడీ సెంటర్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. పట్టణంలోని బాలసదన్, సీడీపీఓ కార్యాలయం, గణేష్ నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆమె గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని కార్యకర్తలకు సూచించారు. బాల కార్మికులను గుర్తించి బాలల సదన్‌కు తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, ఇన్‌చార్జి తహశీల్దార్ నాయబ్‌హుస్సేన్, సీడీపీఓ బి.జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలి

బేస్తవారిపేట: బాలల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలని బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక సచివాలయం-1, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. బాల్య వివాహాలు, బాలల పరిరక్షణ కమిటీ రికార్డులు సచివాలయాల్లో ఉంచాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర కుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, సీడీపీఓ నీలోఫర్ బేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలు పరమ పవిత్రం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మార్కాపురం: సరస్వతీ నది పుష్కరాలు అత్యంత పవిత్రమైనవని పుస్తక రచయిత స్వయంపాకుల యలమంద కోటేశ్వరశర్మ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోపాలుని హరిహరరావు, ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి పేర్కొన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవనగర్‌లో ఉన్న జీవన వేదం ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతీ నది పుష్కరాల ప్రాముఖ్యతపై కోటేశ్వరశర్మ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ డీవీ నారాయణరావు, జాతీయ సైన్సు అవార్డు గ్రహీత టి.జగన్నాథ్ మాట్లాడుతూ.. మే 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ నది పుష్కరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పవిత్రమైన సరస్వతి నదిలో స్నానమాచరించడం వల్ల ఆధ్యాత్మికత భావన పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘ కార్యదర్శి వి.శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఓఏ మల్లిక్, కమలాపురి శ్రీనివాస్, దూళిపాళ్ల మధుసూదన శర్మ, ఆర్టీసీ శాస్త్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం మార్కాపురం డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం నరసింహులు తెలిపారు.

వేడుకగా శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో 13వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. శ్రీరామనామం, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలతోపాటు శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా ఎస్.దుర్గారావు, పద్మావతి, ఎస్.జగదీష్, అనూష దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతోపాటు అన్న సంతర్పణ చేశారు. ఈ నెల 22వ తేదీ వరకు సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనారాయణస్వామి

పాలిసెట్ ఫలితాల్లో దోర్నాల విద్యార్థుల ప్రతిభ

పెద్దదోర్నాల: ఏపీ పాలిసెట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఇన్‌స్పైర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపడంపై ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. మండల కేంద్రానికి చెందిన షేక్ బషీర్ 115 మార్కులతో 436వ ర్యాంక్, షేక్ మాజ్ 113 మార్కులతో 887వ ర్యాంక్ సాధించడంపై కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డి.సుధాకర్ అభినందించారు. కోచింగ్ సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. ఉపాధ్యాయులు సతీష్, శ్రీనివాసరావు, సురేఖ పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన శిక్ష


ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ శాఖ అధికారులు

బేస్తవారిపేట: నాటుసారా తయారు చేస్తే ఎనిమిదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని మార్కాపురం అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.బాలయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని చెన్నుపల్లె, కోనపల్లెలో నాటుసారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటుసారా తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. రీహాబిలిటేషన్, జీవనోపాధి కోసం ఎటువంటి సహాయం కావాలో పాత నేరస్తులను అడిగి తెలుసుకున్నారు. నాటుసారా నిర్మూలనపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంభం ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ఆర్టీసీ డీఎం అభినందన

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ డిపోకు ఏప్రిల్‌లో ఆదాయం తెచ్చిన ఉద్యోగులను మిగిలినవారు ఆదర్శంగా తీసుకోవాలని డీఎం ఏఎస్ నరసింహులు సూచించారు. గురువారం డిపో ఆవరణలో ఉద్యోగుల సన్మాన సభ నిర్వహించారు. అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లు ఎస్.బాషా హుస్సేన్, సుబ్రహ్మణ్యం, రామిరెడ్డి, అత్యధిక ఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు వీబీ కాశయ్య, ఎంబీ కాశయ్యను డీఎం అభినందించారు. ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు ఎం.శ్రీనివాసులు, జి.మూర్తయ్య, ఎస్‌కే అహ్మద్‌ను అభినందించి నగదు పురస్కారం అందజేశారు.


ఉద్యోగులకు నగదు పురస్కారం అందిస్తున్న డీఎం నరసింహులు

ఉపాధ్యాయుని కుటుంబానికి యూటీఎఫ్ చేయూత

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాలుగుళ్ల కిరణ్‌కుమార్ రెడ్డి వెంకటాపురం గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వరిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి చేయూతగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ గిద్దలూరు మండల అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించడమే కాకుండా ఆపద సమయంలో ఆదుకునేందుకు యూటీఎఫ్ ముందుంటుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే కుటుంబ సంక్షేమ పథక సంఘీభావ విరాళం కింద ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూతనిచ్చామన్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందించేందుకు యూనియన్ సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు రమణారెడ్డి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, రాచర్ల మండలం ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


కుటుంబ సంక్షేమ విరాళాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మురుగు గుంతలో కుళాయి


మురుగులోనే నీరు పట్టుకుంటున్న స్థానికులు

కొమరోలు: మండలంలోని గోపాలునిపల్లెలో మంచి నీటి కుళాయి గుంతలో మురుగు ఉండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మోటార్లు వేసినా పైప్ లైన్ ద్వారా ఇంటికి రాకపోవడంతో 3 వీధుల ప్రజలు పబ్లిక్ ట్యాప్ వద్దకు వెళ్లి రోజూ నీరు పట్టుకోవాల్సి వస్తోంది. పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో ఆ నీరంతా కుళాయి గుంతలో నిల్వ చేరి కలుషితమవుతున్నాయి. ఈ విషయమై మూడు నెలలుగా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హైవే రోడ్డుపై తవ్వారు.. వదిలేశారు!


ప్రమాదకరంగా మారిన హైవే రోడ్డు అంచు

కంభం: స్థానిక కందులాపురం సెంటర్‌లో హైవే రోడ్డుపై ఓ వైపు గుంతలు తీసి గత మూడు నెలలుగా అలాగే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కేబుల్స్ లాగేందుకు మూడు నెలల క్రితం నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలో హైవే రోడ్డుకు ఓ వైపు గుంతలు తీశారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో పలుమార్లు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు.

అధికారులు స్పందించి గుంతలను పూడ్పించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల పంపిణీ

పొదిలి రూరల్: ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలు పంపిణీ చేసినట్లు జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ వేము అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు, అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25లో స్కూల్ సర్వే, కమ్యూనిటీ సర్వే నిర్వహించి, ఫ్లోరోసిస్ బాధితులైన వారికి 24 వీల్‌చైర్లు, 22 వాకర్స్, 21 వాకింగ్ స్టిక్స్, 18 వెస్టర్న్ కమోడిటీలు అందజేసినట్లు వివరించారు. ముఖ్యంగా ఫ్లోరోసిస్ బాధితులు పరిశుభ్రమైన తాగునీరు, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం ఫ్లోరోసిస్ బాధితులకు విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పలపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుగుణ కుమార్, శరత్ చంద్ర, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు పంపిణీ చేస్తున్న వైద్యులు

క్లుప్తంగా

మాజీ కౌన్సిలర్ మృతికి 'అన్నా' నివాళి


ఖాశీంపీరా మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు డి.ఖాశీంపీరా అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఉత్తమ్ కుమార్, విశ్రాంత వార్డెన్ నజీర్ అహ్మద్, ఖాశీం తదితరులు ఉన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేస్తవారిపేట: మండలంలోని 19 పంచాయతీల్లో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు సూచించారు. ఈనెల 25వ తేదీలోగా ఏపీఓబీఎంఎంఎస్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం తనిఖీ


శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మస్తాన్‌వలి

కొమరోలు: కొమరోలులోని గ్రామ సచివాలయం-3 భవనంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ మస్తాన్‌వలి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. శిక్షణకు గైర్హాజరు కాకుండా రోజూ రావాలని మహిళలకు సూచించారు. 75 శాతం పైగా హాజరు ఉన్న వారికి కుట్టు మిషన్ అందిస్తారని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో గత మూడు రోజుల వ్యవధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురిని గురువారం మార్కాపురం కోర్టులో హాజరుపరచగా జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ జరిమానా విధించారని పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. నలుగురు వ్యక్తులకు 10 వేల రూపాయలు, మరొకరికి 5 వేల రూపాయల చొప్పున జరిమానా విధించారని వివరించారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు



కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ఎమ్మార్సీకి ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. కొమరోలుకు మొదటి విడతలో భాగంగా 17 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ-2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. పాఠ్యపుస్తకాలను తరగతుల వారీగా సీఆర్పీలతో విభజిస్తున్నట్లు చెప్పారు. రెండో విడత పాఠ్య పుస్తకాలు వచ్చిన తర్వాత పాఠశాలలకు అందజేస్తామని పేర్కొన్నారు.

వేసవిలో నీటి కొరత లేకుండా చూడాలి


నీటి తొట్లను పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి

కంభం: వేసవిలో పశుపోషకులకు నీటి కొరత లేకుండా చూడాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. గురువారం కంభం మండలంలోని సోమవారిపేట, అలాగే బేస్తవారిపేట, చెట్టిచెర్ల పంచాయతీలను ఆమె సందర్శించారు. నీటి తొట్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. పశువులకు సబ్సిడీపై అందిస్తున్న దాణా, గడ్డి గింజలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిడుగుల బారి నుంచి పశువులు, జీవాలను సంరక్షించుకునే పద్ధతులను వివరించారు. పశువులకు బీమా చేయించుకోవాలని సూచించారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరం సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయిబాబాకు ప్రత్యేకమైన రోజు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి శంకర్ ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.